# రాతి తయారి

కె.ఎ. మునిసురేష్ పిళ్లై

"హలో!"

"హలోల్లేవ్! హరీఅప్, హరీఅప్. నిద్దర్లేచావా? రాత్రి ఇల్లు చేరేటప్పటికి ఒంటిగంట దాటినట్లుంది కద! ఉరుకు ఉరుకు! అవతల రైతు బిడ్డొకడు ఆత్మహత్య చేసుకున్నాట్ట. బిడ్డంటే మరీ పసివాడేం కాదులే. ఇరవయ్యోళ్ళుం డొచ్చట. అప్పులు మరీ లక్షల్లో కాదుగానీ, కుటుంబం బాగా చితికిపో యిందట. పురుగుల మందు తాగి... కలెక్టరాఫీసు మెట్ల మీద రాత్రి..."

"అరనిమిషం గ్యాపిస్తావా..."

"ఎందుకూ?"

"చిటికెలో వస్తా."

ఆ మిష మీద నేను కదల్లేదు గానీ, అవతల ప్రవాహం ఆగింది. కాసేపట్లో మళ్ళీ నేనే అన్నా...

"ఆఁ! కానీ..."

"అదే చెప్తున్నా కద! కలెక్టరాఫీసు మెట్ల మీద రాత్రి ఏ వేళలోనో పురుగుల మందు తాగి పడిపోయాట్ట. ఇంకా బాడీ అలాగే ఉందిట. పోలీసులు వచ్చి తీసేసేలోగా మనం అక్కడుండాలి. విజువల్స్ అదిరిపోవాలి. ఎదురుగా ఏదైనా పెద్ద బిల్డింగుంటే మనవాణ్ణి ఎక్కించి ఏరియల్ వ్యూ తీయించు. పురుగుల మందు తాగాడు కద... నోట్లో నురగలు, ఈగలు ముసరడాలు అన్నీ క్లోజప్‌లో క్లియర్‌గా ఉండాలి... విజువల్స్ వెంటనే రావాలి. ఇప్పుడు క్యాప్సూల్‌లోనే వేసేస్తాం... వింటున్నావా... హ...లో..."

"హల్లోల్లేవన్నావుగా..."

"సో, వింటున్నావన్నమాట. అర్థమైందా మీ కెమెరామెన్‌ను వెంటనే పట్టుకెళ్ళు. హరీఅప్. మత్తొదిలిందా... లేదా...?"

"అరగంటలో విజువల్స్ వస్తాయ్. నీకు తెల్సిన సమాచారం రాసే స్కుని చూపించెయ్. వివరంగా మధ్యాహ్నానికి ఇస్తా..."

"ఓకే. మరీ..."

"అరక్షణంలో నువ్వు సెల్ కట్టెయకపోతే, సెల్‌లోంచి కాష్మోరా ప్రయోగిస్తా... చచ్చూరుకుంటావ్..."

"అంతొద్దులే," పదం పూర్తి కాకుండానే కట్ అయిపోయింది. నేను మాత్రం సెల్ అలాగే పట్టుకుని అన్నాను.

"విజువల్స్ ఎలా కావాలో విన్నావ్‌గా."

"ఆఁ! ఆఁ! వెంటనే వెళ్ళాలా. ఇప్పుడే లేచాగా. ఇంకా..."

"ఏడిశావ్‌లే! ఏదో పెళ్ళిచూపుల కెళ్తున్నట్టు. నిద్రలో ఏ అవతారంలో ఉన్నావోగానీ త్వరగా ఉరుకు. విజువల్స్ వెంటనే పంపేయ్. సద్దుమణిగాక, కాల్ చేశావంటే పరిస్థితి బట్టి స్పాట్‌కో, లేదా వాడి సొంత ఇంటి దగ్గరకో వచ్చి జాయినైతా."

"ఓ.కె."

"కదులిక!"

✤

'చిటికెలో వస్తా'నంటూ అవతలివాణ్ణి లైన్లో పెట్టి, నేను చేసిన పని అదీ. మా కెమెరామెన్‌ను సెల్ కాన్ఫరెన్స్‌లోకి తీసుకున్నాను. అవతలివాడి ఉపదేశం మొత్తం వినిపించేశాను. మళ్ళీ మనకు కంఠశోష లేకుండా. చివరగా ఆ ప్రకారం అన్నీ చేసెయ్‌మని పురమాయించేయడమే మన పని.

ఎలక్ట్రానిక్ మీడియాలో రిపోర్టింగ్ చచ్చేంత చావు. పేపర్లలో పన్చేసి నంత కాలం ఓ మోస్తరు సంఘటన ఏది జరిగినా రాత్రి పది గంటల్లోగా వివరాలు ఫోన్ల మీద తెలుసుకుని వార్త రాయడం అలవాటైపోయింది. టీవీల్లో, అది కూడా నిరంతరాయ వార్తా ప్రసారాలు వచ్చేసిన తర్వాత - 'ఎవ్రీ సెకండ్ కౌంట్స్,' అంటాడు మా బాస్. హైదరాబాదు డెస్కులో ఓ టోల్ ఫ్రీ నెంబరు ఫోను ఏర్పాటు చేశాక మరీ... మా దుంప తెగుతోంది. రాష్ట్రంలో ప్రతివాడూ ఏ చిన్న సంఘటన వాడి కంటబడినా వెంటనే ఫోన్చేసి చెప్పేస్తున్నాడు. ఇక మొదలవుతుంది హైరానా. మీ ఊళ్ళో ఫలానా ఘోరం జరిగింది, ఇంకా తెలుసుకోకపోతే ఎలా? వెళ్ళు, వెళ్ళి విజువల్స్ త్వరగా పంపు... అంటూ అడుసుకయ్యలో కదలని కాడెద్దును ములుగర్రతో అదిలించినట్లుగా వెంటబడుతూనే... ఉంటారు. ఒక్కోసారి ప్రాణం ఎంత విసిగిపోతుందంటే... ఈ వెంటబడే వాళ్ళ ఫోన్లన్నీ మాట్లాడేలోగా పుణ్యకాలం కాస్తా గడిచిపోతుంది.

నా పరిస్థితి కొంత మెరుగు. పని చేయడం మర్చిపోయి, ఫోన్ల మీద పని చెప్పడమే పనిగా హైదరాబాదు ఆఫీసు పదవిలో ఉన్నవాడు నా పాత మిత్రుడే. పైగా, ఆ చనువుకు అదనంగా నేను అపార అనుభవమూ గడిం చేశాను. ఎంతగా అంటే మిన్ను విరిగి మీద పడ్డా... విజు వల్స్ నిమిషాల్లో హైదరాబాద్ చేరేలా కిందివాళ్ళను తరుముతూ... నేను మటుకు నింపాదిగా రిపోర్టింగు చేయడం అలవడిపోయింది. ఆ అలవాటుకొద్దీ ఇప్పుడు కూడా రమేష్‌ను స్పాట్‌కు పంపేసి, ఎటూ నిద్ర చెడింది కనుక ఓసారి పడుకున్న భంగిమలోనే బద్ధకంగా ఒళ్ళు విరుచుకున్నాను.

రిమోట్ అందుకుని టీవీ ఆన్ చేశాను. బ్రేకింగ్ న్యూస్ వస్తోంది. 'ఒంగోలు కలెక్టరు కార్యాలయం మెట్ల మీద యువరైతు ఆత్మహత్య!' వెంటనే మా పోటీ ఛానల్ కెళ్ళాను. ఏదో చర్చ నడుస్తోంది. చర్చ కోసం కాదుగానీ, అలాగే ఓ పదినిమిషాలు ఆ చానల్ చూస్తూ గడిపాను. అదే చర్చ! థాంక్ గాడ్ వీడింకా వేయలేదు. దీనికంటే బెటరను కుని కాసేపు ఎఫ్ టీవీ ట్యూన్ చేశాను. పొద్దున్నే మత్తు వదలడానికి బెడ్‌కాఫీ కంటే మంచి రిఫ్రెష్‌మెంట్ అయిపోయింది ఇది నాకు. మళ్ళీ పోటీ ఛానల్‌లోకి వెళ్ళేసరికి వాడు కూడా బ్రేకింగ్ న్యూస్ ఇచ్చేశాడు. ఎలక్ట్రానిక్ మీడియాలో ఇదో తలనొప్పి. సమాచారం వరకూ యథేచ్ఛగా కాపీ జరిగి పోతుంది. అడిగే దిక్కులేదు. మళ్ళీ మా ఛానల్‌లో కెళ్ళాను. వార్తలు మొదలై, మొట్టమొదటే రైతు శవం విజువల్ వేసేశారు. 'వెల్‌డన్ రమేష్,' మనసులో అభినందించేశాను.

ఇక పర్లేదు. ఓ కునుకు తీసి కదలొచ్చు. టీవీ కట్టేసి కళ్ళు మూసు కున్నాను. కునుకుకు స్పీడ్ బ్రేకర్‌లాగా మళ్ళీ సెల్ మోగింది.

"అన్నా, బాడీ క్లియర్ చేసేశారు. పోస్టుమార్టం తర్వాత వాళ్ళ పల్లెకు తీసుకెళ్ళిపోతారు. నువ్వు హడావుడి పడొద్దు. మనం భోంచేసి అక్కడికెళ్తే చాలు.''

వీడికి నామీద ఎంత నమ్మకమో!

"సర్లే. నువ్వు ఇంటికెళ్ళి, భోంచేశాక ఇటొచ్చెయ్! వస్తూ ఓ బిర్యానీ పార్సిల్ పట్రా.''

ఇక పూర్తి కునుకే తీయొచ్చు. సమాచారం తెలిసి మనసు నెమ్మదించగానే సెల్ఫ్ స్విచ్ఛాఫ్ అయిపోయింది! కళ్ళు మూతలు పడిపోయాయి.

✤

"రేయ్ నీకు బుద్ధుందా! ఇంత దూరం, చెత్తరోడ్డు అని తెలిస్తే కారు తెచ్చుకుని బిల్లు పెట్టేవాళ్ళం కదా!'' కోప్పడ్డాను.

"ఈ ఒక్కసారికి సర్దుకో అన్నా. ఈసారెప్పుడైనా మన పక్కింటివాణ్ణే ఆత్మహత్య చేసుకోమని చెబ్దాం. దూరం వెళ్ళే శ్రమ లేకుండా...''

నాకూ నవ్వొచ్చింది. "ఎందుకూ? నువ్వే ఆత్మహత్య చేసుకో! విజువల్స్ కోసం నా పాట్లేవో నే పడ్తా...'' మెత్తగా అంటించాను.

వాడూరుకోలేదు. "ఆ పరిస్థితి తెప్పిస్తావని నాకు తెలుసు,'' ఒకింత శ్లేషగా అంటించాడు.

మాటల్లోనే ఆ ఊరొచ్చేసింది.

ఇల్లు కనుక్కోవడం కష్టం కానే కాదు. ఏడ్చే వాళ్ళుంటే కళ్ళు తుడవడానికి మనలో చాలామంది దయాత్ములు ఉంటారు. అలాంటి గుంపు కనపడిన చోట ఆగాం. అందరూ తలో రకంగా సానుభూతి కురిపిస్తున్నారు. అదొక చిన్న చుట్టు గుడిసె. ముందర తాటాకు కప్పిన చిన్న పందిరి ఉంది. ఇంటి గడప దగ్గరే నలుగురు ఆడవాళ్ళు కూర్చుని ఉన్నారు. వారిలో మరీ వయసు మీరని ఓ ముసలమ్మ, ఎండిపోయిన ఒళ్ళు. శిథిలమైపోయిన గుడిలాగా ఉంది. అప్పటికే అలసిపోయినట్లుంది. స్పృహ తప్పిందేమో! మరో మహిళ పొదివి పట్టుకుని ఉంది. నిశ్శబ్దంలో క్రమం తప్పకుండా ఏడ్పు తాలూకు వెక్కిళ్ళు. అప్పుడప్పుడూ 'నా బిడ్డ నా బిడ్డ,' అంటూ గొణగడం... వినిపిస్తున్నాయి.

"ఎస్సైని అడిగా. ఇంకా గంట పడుతుందిట.''

అందుకే నాకు రమేశ్ అంటే ప్రేమ. మన సమయం వృథా కానివ్వడు. సమాచారం మోసుకొచ్చేస్తుంటాడు. మిగిలిన ఛానల్స్ వాళ్ళింకా రాలేదు. అక్కడి గుంపులో జొరబడి నలుగురిని మైక్ ముందు మాట్లాడిస్తే సరి. పెద్ద స్టోరీ అయిపోతుంది. ఇవాళ్టికి అది చాలు. రేపు మళ్ళీ ఫాలో అప్‌కు కొంత దాచుకోవాలి. దానికోసం అరగంట చాలు.

"సరే, పద!'' పొలం వైపు నడిచాను. లైటర్ ఉందో లేదోనని జేబు తడుముకుంటూ.

✤

ఎస్సై నోట్లో ఎప్పుడూ నిజం రాదు. శవం వచ్చేసరికి రెండు మూడు గంటలు దాటింది. మా సిగరెట్టు ప్రేమ కూడా కొంత లాభం తెచ్చింది. తెలియకుండానే అయినా మేం వెళ్ళింది ఆ చచ్చిన రైతు పొలంలోకే.

బీళ్ళు పడ్డ పొలాలు. ఎండిన చెట్లు... సారీ, మొక్కలు... ఛ... ఏమందాం... నారు. ఓకే. ఎండిన వరి నారు.

అద్దిరింది. 'రోజూ తమ దరికి వచ్చి ఆశగా చూసి, ఆకాశాని కేసి చూసి కాసేపు గడిపి వెళ్ళే నేస్తం... దిగంతాలకు వెళ్ళిపోయాడని ఈ ఎండిన వరికి, గుండె పగిలిన పొలానికి ఏం తెలుసు పాపం...' అంటూ వాయిస్ ఓవర్ వేసి ఈ విజువల్స్ చూపించామంటే పేలిపోతుంది. కానివ్వమంటూ అన్నీ షూట్ చేయించాను.

తిరిగి ఊళ్ళోకి వచ్చి అందరితో మాట్లాడాం. వినీ వినీ అరిగిపోయిన పాత రికార్డులాగా... అన్నీ మామూలు బాధలే. కరువు, అప్పులు, ఆకలి గట్రా గట్రా... కొత్తగా ప్రెజంట్ చేయడానికి మంచి పాయింటేం దొరకలేదు. అంతా పూర్తయి గోళ్ళు గిల్లుకుంటూ కూర్చున్నప్పుడు... వచ్చింది పోలీసు జీపు. అందులోంచి అన్ని ఛానెళ్ళ వాళ్ళూ బిలబిలమంటూ దండులా దిగి ఉరికారు. మా రమేశ్‌కు కొత్తగా నేర్పక్కర్లేదు.

దాని వెనుకే అంబులెన్సు.

పొద్దు గుంకడానికి ఇంకా కొంత వేళే ఉంది. ఆ లోగిలి మాత్రం వీడియోలైట్లతో మధ్యాహ్నంలా వెలుగుతోంది.

ఊళ్ళో వాళ్ళు ఒకరిద్దరు చేయందిస్తే పోలీసులు బాడీ తీసుకెళ్ళి పందిట్లో పడుకోబెట్టారు.

"అమ్మా బిడ్డొచ్చినాడు...''

ఆ ముసలమ్మను పొదివి పట్టుకుని ఉన్న ఇంకో తల్లి మెల్లగా గొణిగింది.

అంతసేపూ స్పృహలో లేనట్లుగా శవంలా పడి ఉన్న ఆ ముసలామె దిగ్గున లేచింది. తను పడి ఉన్న గడపకీ, పందిట్లో శవానికీ నాలుగంగలే! అయినా, ప్రవాహంలా ఉరికింది. దిక్కులు బెదిరిపోయేట్టు, 'నాయినా నా బిడ్డా...' అని బొంగురుపోయిన గొంతుతో బిగ్గరగా అరిచింది. దబ్బున కుప్పకూలిపోయింది. శోకం ఆమెను ఆకులా ఊపేస్తోంది.

గుడ్డలో చుట్టి ఉన్న కొడుకును పాదాల దగ్గర్నుంచి తల వరకు తడిమి తడిమి చూసుకుంటోంది. పొగిలి పొగిలి ఏడుస్తోంది. బుగ్గలు పుణికి పుణికి ముద్దు పెట్టుకుంటోంది.

"నేనేనమ్మా నా బిడ్డను సంపేసిందీ... నేనేనమ్మా! దొంతికుండ నిండుకుందని నా నోటితో నేనే జెప్పినానమ్మా... సంపేస్తినే...! నాలుగ్గింజలు అడక్కొచ్చయినా కాసింత గంజి గాసి పోస్తా నాయినా... లెయ్ నాయినా... కొంపలో బియ్యం లేవని ఇంకెప్పుడూ చెప్పనే  చెప్పన్నాయినా... ఇంక చెప్పనే చెప్పను... లేసి రా నాయినా...'' ఏడుపులో కలిసిపోయి ఆ అరుపులు గరగరమని వినిపిస్తున్నాయి.

మనవాళ్ళంతా జూమ్ లెన్సుల్లోంచి ఏడుపు అద్భుతంగా ఉండేలా విజువల్స్‌ను బంధిస్తున్నారు. డిటిఎస్ వంటి ఎఫెక్టుల కోసం కొందరు కాలర్ మైకులు కూడా తెచ్చారు. కానీ, ఆవిడకు దాన్ని అమర్చేంత వ్యవధి వారికి చిక్కనట్టుంది పాపం! మామూలు మైకులు పట్టుకుని కుస్తీలు మొదలెడుతున్నారు.

మావాళ్ళ పని కత్తి మీద సాము. నిజానికి ఆ మైకు పట్టుకుని అడిగే పని నాదే! కానీ మావాడు సమర్థుడు కాబట్టి, ఓ గ్రామస్తుడి చేతికి మైక్ ఇచ్చి ఆ గుంపులోకి నెట్టాడు. ఓవైపు ఆవిడ పొర్లిపొర్లి ఏడుస్తోంటే... రాష్ట్ర ప్రజానీకానికంతటికీ మెరుగైన సమాచారాన్ని అందించడం కోసం ఇంత కష్టపడాల్సి రావడం మాకు కత్తి మీద సాము కాక మరేంటి. ఒక్కొక్కరూ వరపరంపరగా ప్రశ్నలు గుప్పిస్తున్నారు.

"అమ్మా! చెప్పండి, మీ కొడుకు ఆత్మహత్యకు కారణం ఏమను కుంటున్నారు?"

"ప్రభుత్వం ఉచిత విద్యుత్తు, రుణాలు ప్రకటించినా ఆత్మహత్య చేసుకున్నాడంటే ఆ హామీలు రైతులకు సంతృప్తిగా లేనట్లేనా అమ్మా?"

"మీ కుటుంబం దీనస్థితిలో ఉందని సాయం అడిగితే, ప్రభుత్వ పరంగా ఆదుకోవడానికి మీ ఎమ్మెల్యే తిరస్కరించాడా...?"

"గత ప్రభుత్వ నిర్వాకాల వల్లే మీ కుటుంబం ఆర్థికంగా చితికి పోయి, ఇప్పుడు ఆత్మహత్యకు దారి తీసిందా..."

"ఈ పల్లెలో భూస్వాములు, పెత్తందార్లు మీబోటి పేద రైతులు బతకనీయకుండా దోచుకు తినేస్తున్నారా... చెప్పమ్మా, చెప్పు?" ఒకడి గొంతులో ఆవేశం వెల్లువెత్తేస్తోంది.

మావాళ్ళు... ఎవడికి ఎలాంటి సమాధానం కావాలో, దానికి తగ్గట్టుగా ప్రశ్నల్ని తయారుచేసుకుని ఆ తల్లి మీదికి వదులుతున్నారు.

ఆమెకు మాత్రం ఈ లోకం పట్టినట్లు లేదు. ఏడ్చి ఏడ్చి అలాగే ఊపిరి వదిలేయాలన్నట్లుగా, ఊపిరి వదిలేసే వరకూ అలాగే ఏడుస్తూ ఉండాలన్నట్లుగా... శృతి పెంచుతూ, తగ్గిస్తూ ఏడుస్తోంది.

నేను టౌనుకు వెళ్ళగానే ఎలాంటి స్టోరీలు ఇవ్వాలో అప్పటికే ప్లాన్ చేసేసుకుంటున్నాను. ఇక ఇక్కడేం మిగల్లేదు. ఏదైనా జరుగుతుందేమోనని వేచి ఉన్నాం అంతే! అంటే, రైతు తరఫున ఎవరైనా ఆవేశంగా దేన్నయినా ప్రభుత్వ ఆస్తుల్ని తగలబెట్టడం వంటివి, కనీసం ఎమ్మార్వో వస్తే జీపును అడ్డగించి కొంత గొడవ చేసినా చాలు. అలాంటివి జరిగితేనే మజా! వేచి ఉండక తప్పదు మరి! కాస్త దూరంగా వెళ్ళి మళ్ళీ సిగరెట్ అంటించాను. లైటర్ ఆపేలోగా పెదవుల మధ్యనున్న సిగరెట్ ఒక్క ఉదుటున జారి కింద పడిపోయింది. నివ్వెరపోయి అటు పరుగెత్తాను.

ఆమె బిడ్డ మీద పడి ఏడుస్తోంటే మనవాళ్ళ మైకులన్నీ తేనెతుట్టలా మొహాన్ని కప్పేసి ఉన్నాయి. అంతవరకే నేను సిగరెట్‌కు వెళ్లేముందు చూసింది. అప్పటివరకు ఎంతో బలహీనంగా... ఇప్పుడే చనిపోతుందేమో అనిపించేలా ఉన్న ఆమె ఒక్కసారిగా పూనకం వచ్చినదానిలా లేచి నిల్చుంది. ఎప్పుడో జారిపోయిన పైటను లాగి భుజం మీద నుంచి బిగదీసి బొడ్లో దోపింది. చెమటకారి జిడ్డోడుతున్న మొహానికి అతుక్కుపోయి ఉన్న జుట్టు పాయల్ని కొంచెం వెనక్కి నెట్టింది. ఎడమచేత్తో బర్రున ముక్కు చీది కొంగుకు పూసింది. పక్కన మనుషులెవరైనా ఉన్నారేమో కూడా చూసుకోకుండా, బలాన్నంతా కూడగట్టుకుంటున్నట్లు గట్టిగా కాండ్రించి ఉమ్మింది. కుడిరెక్క కాస్త పైకి లేపి, చెమటతో అట్టలు కట్టి ఉన్న రైకకే మూతీ మొహం తుడుచుకుంది. వంగి చేతుల్తో రెండు గుప్పిళ్ళ నిండా మట్టి జవురుకుంది.

మంచి సీన్ నడుస్తోందంటూ మనవాళ్ళు కెమెరా యాంగిల్స్ సరి చూసుకుంటూ మరింత చురుగ్గా పని కానిస్తున్నారు.

విరబోసి ఉన్న జుట్టు... ఏడ్చి ఏడ్చి నిప్పుకణికల్లా కళ్ళు... ఆవేశమో, బాధో, మైకమో ఊగిపోతున్న బక్క పలచటి శరీరం...

సంజె వెలుగు మెరుపు కమ్మిందో... కడుపుమంట ఎరుపు ఎగ జిమ్మిందో... మండే నిప్పుల కొలిమిలాగా ఉన్న మొహం...

నాకు మాత్రం కాళిక కనిపిస్తోంది.

"ముండమోపి ఎదవల్లారా...!"

ఒక్కసారిగా చేతుల్నిండా జవురుకున్న మట్టిని మైకులు పట్టుకున్న వాళ్ళ మీదికి విసిరికొట్టింది.

"నా బిడ్డరా... సచ్చిపోయినాడు రా. మీయమ్మా కడుపులు మాడ. నా బిడ్డ సచ్చిపోయినాడురా... నన్ను ఏడవనియ్యండి రా! నా సావు నన్ను సావనియ్యండి రా! మీకేం పొయ్యేకాలం వొచ్చిందిరా మాదత్యోదుల్లారా... ఈ గొట్టాలన్నీ నా నోట్లో తెచ్చి పెడ్తారేందిరా... కనీసం నా బిడ్డ మీద ఈ కడపటి రోజైనా కళ్ళనిండా కడవడు నీళ్ళు గార్చి ఏడవనియ్యరేందిరా ముదనష్టపు ఎదవల్లారా... మీ పెళ్ళాలు ముండమొయ్యా..."

అరుస్తూ... అరుస్తూ... అరుస్తూ... అలాగే ఒరిగిపోయింది.

స్పృహ లేదు.

ఒకామె పరుగున వెళ్ళి దోసిలితో నీళ్ళు తెచ్చి మొహాన కొట్టింది.

"బిడ్డా, బిడ్డా..." అని గొణుగుతోంది.

మావాళ్ళ చేతుల్లో మైకులు జారిపోయాయి. ఎవరో ఒక పెద్దమనిషి వచ్చి కసురుకున్నాడు. కెమెరాల కళ్ళన్నీ పక్కకు మళ్ళాయి. కొన్ని రెప్పలు మూశాయి.

తిడితే తిట్టారు గానీ ఒకింత తీరిక దొరికింది లెమ్మని మనవాళ్ళు ఎడంగా వచ్చి సేద తీరుతూ కెమెరాలు వేళ్ళాడేసుకుని భుజం గూళ్ళు ఒత్తుకుంటున్నారు.

అంతలో ఒక్కసారిగా మళ్ళీ కలకలం.

ఓ గుంపు కుర్రాళ్ళు మా వాళ్ళ వెంబడి తరుముతున్నారు. రాళ్ళుచ్చుకు కొడుతున్నారు. అంతా పరుగులు. రమేశ్ కోసం కళ్ళు వెదికాయి. కనపళ్ళేదు. పారిపోయాడా? అయిపోయాడా? దూరంగా ఉండడం మూలాన నేను కూడా తరమాల్సిన మనిషినేనని వాళ్ళు గుర్తించలేదు.

"సంపుతాం కొడకల్లారా," ఏదో ఒక గొంతు గుంపును మరింత రెచ్చగొడుతోంది. అంతలో గుంపులోకి ఎస్సై జొరబడ్డాడు. "ఇంకేం లేదు లెండి సార్. అంతా అయిపోయింది కదా సార్. పదండి సార్..." సర్దుతూ, తీస్కొచ్చి అందర్నీ హడావుడిగా జీపెక్కించేశాడు బలవంతంగా.

జీపు కదిలింది. తానాగిపోయాడు.

నేనూ ఆగిపోయాను. రమేశ్ కనపడక, చాలాసేపటివరకూ!

✤

"అవునా?" స్వరంలో దిగ్భ్రమ, భయం గమనించేశాడు. మోటారు సైకిలు నడుపుతూనే...

"అవునన్నా! మరి కుర్రాళ్ళకు అంత కోపమూ ఎందుకొచ్చిందను కున్నావ్? నేను కొంచెం ముందే పసిగట్టా! అందుకే పరుగున వెళ్ళి పక్కనున్న మేడ ఎక్కేశా! మనకేం, మంచి పవర్‌ఫుల్ జూమ్ ఉందిగా!"

ఏం చెప్తున్నాడో వినబడట్లేదు. కళ్ళ ముందు శూన్యంగా ఉంది. గుండె అంతా చీకటైపోయింది. అది మామూల్ది కాదు. క్షణంలో తేరుకుంది. సెల్ అందుకున్నాను. చేరవేయడానికి.

"అయ్యయ్యో..."

"ఇంకా నీలో ఇలాంటివి మిగిలే ఉన్నాయేంట్రా..." వెటకార మాడాను.

"సర్లే చెప్పు," గొంతులో తేడా వచ్చింది.

"ముందు బ్రేకింగ్ న్యూస్‌లో ఇచ్చేయ్. వేరే ఛానల్స్ వాళ్ళెవరూ లేరు. చెప్పాగా అందర్నీ తరిమేశారు. విజువల్స్ మనకే స్కోరు. ఇంకెవరికీ దొరకవ్ కూడా! ఇంకో అయిదు నిమిషాల్లో అక్కడుంటాయ్."

"సరే, సరే..." ముక్తసరిగా అంటున్నాడు.

"న్యూస్ బ్రేక్ వరకు ఆగకుండా రాగానే వేసేయ్! రాష్ట్రమంతటా ఇవాళ మన ఘనకార్యంతో అట్టుడికి పోవాలి...

"రాస్కో - 'కొడుకు వెనకే తల్లి... తరగని శోకంతో తిరిగిరాని లోకాలకు...' అని వేశామే అనుకో..."